సాక్షి మెదక్

బుధవారం । 27 । నవంబర్ । 2024



'స్వచ్ఛ బడి..

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో నియమితులైన సర్వీస్ పర్సన్‌లకు నెలసరి వేతనాలు ఇవ్వాలని విద్యాశాఖ ఆదేశించింది. వివరాలు 8లో ▸



పట్టుదలతో పోరాడాలి

క్రీడాకారులు ఓటమికి భయపడకుండా పట్టుదల పోరాడి విజయం సాధించాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు.

వివరాలు 8లో ▸



మొక్కలు నాటి పరిరక్షించాలి

ప్రతి ఒక్కరూ భావితరాలను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఎస్టీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ



హాస్టల్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి నీలిమా

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌ను మంగళవారం రాత్రి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి నీలిమా ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నిర్వహణపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజన అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఉన్న కూరగాయలు, పప్పులను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ దశరత్‌కు సూచనలు చేశారు.

ప్రహరీ నిర్మాణ పనుల ప్రారంభం

నిజాంపేట(మెదక్): నూతన బస్టాండ్ ప్రహరీ నిర్మాణ పనులను మంగళవారం మెదక్ డీఎం సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా 35 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన చిన్న పైడి శ్రీనివాస్ రెడ్డి 20 గుంటల భూమిని ఆర్టీసీ పేరిట రిజిస్ట్రేషన్ చేశారన్నారు. రూ.15 లక్షల ప్రభుత్వం మంజూరు చేయగా ఈ స్థలంలో ప్రహరీ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మెదక్ ఆర్టీసీ సీఐ వీరబాబు, ఆర్టీసీ ఏఈ అమర్ సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల టెండర్ల ఆదాయం రూ.9.60 లక్షలు



వేలం పాటలు నిర్వహిస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో మంగళవారం నిర్వహించిన టెండర్ల ద్వారా రూ.9.60 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చంద్ర శేఖర్, ఇన్‌స్పెక్టర్ రంగారావు తెలిపారు. దేవస్థాన ప్రాంగణంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు వినోదం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు వేలంపాటలు నిర్వహించగా ఒక టెండర్‌దారు హక్కు పొందాడన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి అదనంగా రూ.49 వేల ఆదాయం వచ్చిందన్నారు. కొబ్బరికాయలు, ఒడి బియ్యం, పూజా సామగ్రి విక్రయించుకునేందుకు వేలంపాటలు నిర్వహిస్తే తక్కువ పాట పాడటంతో టెండరు వాయిదా వేశామని చెప్పారు. కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు, చెప్పుల స్టాండ్ నిర్వహణ కోసం సైతం వేలం నిర్వహించగా ఎవరూ పాల్గొనలేదని, దీంతో వాయిదా వేశామన్నారు. సీనియర్ అసిస్టెంట్ సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాం, వేలం పాటదారులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించండి

- రైతులకు ఏడీఏ పుణ్యవతి సూచన



రైతునేస్తం వీక్షిస్తున్న ఏడీఏ పుణ్యవతి తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు అందించే ముఖ్యమైన విషయాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. మంగళవారం చిలప్‌చెడ్ రైతువేదికలో శాస్త్రవేత్తలతో జరిగిన వీడియో కన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. వరి కోతకాగానే మొక్కజొన్న పంట వేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా వేసే పంటల గురించి వివరించారన్నారు. ఆధునిక పద్ధతిలో చేసే వ్యవసాయానికి డ్రోన్ల ఆవశ్యకత గురించి విశదీకరించారని చెప్పారు. రైతులు ఒకే పద్ధతిలో వ్యవసాయం చేయకుండా సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడి సాధించాలని చెప్పినట్లు వెల్లడించారు. మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, ఏఈఓలు కృష్ణవేణి, భూపాల్, మల్లారెడ్డి వర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఇటు సమగ్ర.. అటు ఇందిరమ్మ

కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేస్తోంది. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పైలెట్ ప్రాజెక్టు కింద మెదక్ జిల్లా ఎంపిక చేసింది. క్షేత్రస్థాయిలో హవేళిఘనాపూర్ మండలం లింగ్సాన్‌పల్లి, నర్సాపూర్ మున్సిపాలిటీ 5వ వార్డులో ఈనెల 21 నుంచి సర్వే ప్రక్రియ చేపట్టారు. ఆ మేరకు ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాల రూపకల్పన చేయనున్నట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు.



సొంత ఇంటి నిర్మాణం

జిల్లాలో సర్వేల జోరు

- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్టు ..
- లింగ్సాన్‌పల్లి, నర్సాపూర్ మున్సిపాలిటీ 5వ వార్డు ఎంపిక
- విధివిధానాల రూపకల్పన కోసమే అంటున్న అధికారి

మెదక్‌జోన్ : పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన లింగ్సాన్‌పల్లి, నర్సాపూర్ మున్సిపాలిటీలోని 5వ వార్డులో ఈనెల 21 నుంచి సర్వే కొనసాగుతోంది. ఈ గ్రామంలో పంచాయతీ సెక్రటరీ, మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్ ఈ సర్వే చేస్తున్నారు. 26 ప్రశ్నలతో ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపరుస్తున్నారు. ముఖ్యంగా ఉన్న ఇల్లు సొంతదా? అద్దె ఇల్లా? సొంతదైతే గతంలో ఇందిరమ్మ పథకంలో నిర్మించారా? లేక బ్యాంక్ రుణం తీసుకుని నిర్మించారా? ఇటుకలతో నిర్మించారా, మట్టిగోడలా, ఆర్‌సీసీ భవనమా? పెంకుటిల్లా? ఆ ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉంటున్నాయి. పిల్లలు ఎంతమంది, భూమి ఎంత ఉంది, ఏ కులం, ఆధార్‌నంబర్ తదితర 26 ప్రశ్నలతో సమాచారం సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు.

సన్నగిల్లుతున్న ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వం మే మాసంలో ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి కుటుంబానికొక దరఖాస్తు స్వీకరించింది. పథకాలకు సంబంధించి పింఛన్‌లు, ఉచిత కరెంట్, గ్యాస్, తదితర పథకాలతో పాటు ఇళ్లు కట్టుకుంటారా అనే ప్రశ్నకు జిల్లాలో 1,93,169 మంది కట్టుకుంటామని టిక్ మార్క్ చేశారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు ఇస్తామని ప్రకటించింది. లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలను సైతం వేసింది. ఇక ఇళ్లు మంజూరవుతాయని ఎదురు చూస్తున్న తరుణంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పైలెట్ ప్రాజెక్టు పేరిట సర్వే చేస్తోంది. దీంతో గూడు లేని పేద ప్రజలు ఇళ్లు మంజూరవుతాయా? లేవా? అని భావిస్తున్నారు. మరికొందరు అప్పు చేసి ఇళ్లు కట్టుకుంటున్నారు.

ఎన్ని సార్లు సర్వే చేస్తారు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే లింగ్సాన్‌పల్లి, నర్సాపూర్ మున్సిపాలిటీ 5వ వార్డులో కొనసాగుతుండగా ఇల్లు మంజూరు చేస్తారో లేదో కానీ సర్వేల మీద సర్వేలు చేస్తున్నారు. ఇలా ఎన్ని సార్లు చేస్తారంటూ తమ వద్దకు వచ్చిన అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. హవేళిఘనాపూర్ మండలంలోనే లింగ్సాన్‌పల్లి చిన్నది. 153 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు 71 ఇళ్ల సర్వే పూర్తి అయిందని గ్రామ సెక్రటరీ సంధ్య తెలిపారు. ప్రస్తుతం సెక్రటరీ సర్వే పూర్తి చేశాక మళ్లీ ఎంపీడీఓ సర్వే చేసి ఫైనల్ రిపోర్టు ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిసింది. ఇంకోసారి సర్వే జరగనుందని సమాచారం.



లింగ్సాన్‌పల్లిలో చేస్తున్న సర్వే

ఏళ్లుగా ఎదురుచూపు



ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందేమో అని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. కళ్లుకాయలు కాస్తున్నాయ్ తప్ప ఉపయోగం ఉండటం లేదు. నేను దశాబ్దంగా అద్దె ఇంట్లో ఉంటున్నా. సొంతింటి కలనెరవేరుతుందో లేదో?.

– శివలింగం, శంకరంపేట

అందరికీ సమాన హక్కులు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

మెదక్‌జోన్: బాల్యం నుంచే రాజ్యాంగ పాఠాలు బోధించాలని, ప్రజలంతా ఒక్కటేననే భావన చిన్నతనం నుంచే అవగతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా పారదర్శకంగా ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించేలా అధికారులు కృషిచేయాలన్నారు. రాజ్యాంగం ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వ కారణమన్నారు. దేశంలో కుల, మత, భాష, లింగ, ప్రాంత, జాతి మొదలైన తారతమ్యాలు లేకుండా అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగం కరదీపికలా పని చేస్తోందన్నారు. తొలుత అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఏవో యూనస్, శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

కొల్చారం(నర్సాపూర్): సంక్షేమ వసతి గృహ విద్యాలయాలు, కళాశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల సంక్షేమ వసతి గృహ పాఠశాలను జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్‌తో



మెదక్‌జోన్: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వంటకు ఉపయోగించే కూరగాయలు, వండిన వంటలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరగకూడదని సిబ్బందిని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ మండల విద్యాధికారి సత్యనారాయణ, వైద్యాధికారి రమేష్, కేజీబీవీ ప్రత్యేక అధికారి ధరణి, ఎంపీహెచ్‌ఓ మదన్ మోహన్, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

పకడ్బందీగా డేటా ఎంట్రీ చేయాలి

హవేళిఘణాపూర్(మెదక్): సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం మెదక్ మండలం ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. సమాచారం నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ఒకటి రెండు సార్లు సరిచూసుకొని నమోదు చేయాలన్నారు. ఎంపీడీఓ రఘు, పంచాయతీ సెక్రటరీలు రమేశ్, లిఖిత తదితరులు ఉన్నారు.

గ్రామీణ రోడ్లకు రూ.15 కోట్లు

– మెదక్ ఎమ్మెల్యే రోహిత్

– శానాయపల్లి రోడ్డుకు శంకుస్థాపన

పాపన్నపేట(మెదక్): మెదక్ నియోజకవర్గంలో గ్రామీణ రోడ్ల కోసం రూ.15 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండలంలోని శానాయపల్లి నుంచి ఎల్లాపూర్ వరకు చేపట్టనున్న రోడ్డుకు ఆయన భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న మూడు రోడ్లకు సీఆర్ఆర్ నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఒక శానాయపల్లి రోడ్డుకు రూ.1.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఏడుపాయల మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, పార్శి నర్సింహులు, ఇంద్రసేనారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



శానాయపల్లి వద్ద రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీఓ యాదయ్య

రుచికరమైన భోజనం అందించాలి

జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

టేక్మాల్(మెదక్): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య తెలిపారు. మంగళవారం టేక్మాల్ కేజీబీవీని డీపీఓతో పాటు తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీఓ విఠల్, ఎంఈఓ సుజాతలతో కలిసి ఆయన సందర్శించారు. హాస్టల్ పరిసరాలు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం వారు చెప్పిన సమస్యలను విన్నారు. ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతూ, మెలకువలతో కూడిన విద్యాబోధన చేయాలని ఆదేశించారు.

పండ్లతోటలతో అధిక రాబడి

ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం చేపట్టి అధిక రాబడిని పొందాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య తెలిపారు. ఉపాధి పనుల జాతర, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని కుసంగిలో మామిడి తోటల పెంపకం పనులను ప్రారంభించారు. ఉపాధి పథకంలో పెట్టుబడులు లేకుండా రైతులు లాభం పొందాలని సూచించారు.

ఆకస్మిక తనిఖీ

తూప్రాన్: ప్రభుత్వ గురుకులల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బాలికల, బాలుర గురుకుల పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనం, కూరగాయలను పరిశీలించారు. కూరగాయలు నాసిరకంగా ఉండటంతో మరోసారి ఇలా జరగకూడదని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం మురుగుదొడ్లు, మూత్రశాలలు పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు.

శివాకృతిలో దీపారాధన



కార్తీక మాసం పురస్కరించుకొని మంగళవారం ఏడుపాయల్లో ప్రదోష పూజలు చేశారు. అనంతరం దీపారాధన, ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. ఆలయ మండపంలో భక్తిశ్రద్ధలతో మహిళలు శివాకృతిలో దీపాలు వెలిగించారు.

పాపన్నపేట(మెదక్):

వేధిస్తున్న వైద్యుల కొరత

నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. రోగుల నాడి పట్టి, స్టెతస్కోప్ పెట్టి చూసే పరిస్థితి లేకుండాపోయిందని విమర్శలున్నాయి. దీంతో రోగులకు వైద్యసేవలు మొక్కుబడిగా అందుతున్నాయి. మరో వైపు ఉన్నవారిలో కొందరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. జ్వరబారిన పడిన వారిని అయితే కనీసం టెంపరేచర్ కూడా చెక్ చేయకపోవడం సర్వసాధారణంగా మారింది. ఒకవేళ రోగుల తాకిడి ఎక్కువైతే నిమిషం సమయం కూడా వైద్యులు కేటాయించరనే ఆరోపణలున్నాయి.

- డిప్యూటేషన్‌లోను పలువురు
- నామ్‌కే వాస్తేగా వైద్యసేవలు
- రోజూ ఓపీకి 400 మంది
- నాడి పట్టి.. స్టెతస్కోప్ పెట్టి చూడని డాక్టర్లు
- నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి దుస్థితి ఇదీ

నర్సాపూర్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉంది. అప్పటికే ఖాళీలు ఉంటే ఉన్న వారిలో కొందరు డిప్యూటేషన్లపై వెళ్లారు. ఉండాల్సిన ఆరు సివిల్ సర్జన్‌లు ఉన్నారు. ఐదు డిప్యూటీ సివిల్ సర్జన్లకు గాను ముగ్గురు ఉండగా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 20 సివిల్ అసిస్టెంట్ సర్జన్‌కు గాను ఎనిమిది మంది ఉండగా 12 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఈ ఎనిమిది మందిలో ఆరుగురు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. 20 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర విభాగాలలో కలిపి మొత్తంగా 38 ఖాళీలను భర్తీ కావాల్సి ఉన్నాయి.

ఓపీకి రోగుల తాకిడి

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓపీ విభాగం పనిచేస్తుంది. సుమారు 400 నుంచి 450 వరకు రోగులు వస్తుంటారు. అందులో చిన్నపిల్లల ఓపీలు 50 నుంచి 80 వరకు ఉంటాయి. సాధారణ రోజుల్లో కంటే మంగళ, శుక్రవారాల్లో ఓపీ సంఖ్య మరింత అధికం.

నిమిషానికి ఒకరికి వైద్యం

ప్రభుత్వ ఆస్పత్రిలోని ఓపీ విభాగంలో నిమిషానికి ఒక రోగికి వైద్యం చేసి పంపుతున్నారు. వైద్యుల కొరత కారణంలో అవుట్ పేషెంట్ విభాగంలో రోజూ ముగ్గురు వైద్యులు (ఒక చిన్నపిల్లల డాక్టరు, ఇద్దరు సివిల్ అసిస్టెంటు సర్జన్లు) సేవలందిస్తున్నారు. పెద్దల ఓపీ... 350 మందికి ఇద్దరు వైద్యులు సేవలందిస్తున్నారు. ఒక్కో వైద్యుడు 3 గంటల్లో 175 మందికి వైద్యం అందిస్తున్నారు. ఈ లెక్కన ఒక నిమిషానికి ఒక రోగిని పరీక్షించి పంపుతున్నారు. ఒకవేళ 350 మంది కంటే ఎక్కువ మంది వస్తే నిమిషం లోపే పరీక్షించి పంపుతున్నారు. ఓపీలో రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో వైద్యులు రోగుల నాడి పట్టి పరీక్షించడం, స్టెతస్కోప్‌తో పరీక్షించడం లేదు. రోగులు వారికి ఉన్న జబ్బు విని అందుకు అవసరమైన మందులు రాసి పంపిస్తున్నారు. జ్వరంతో వచ్చే రోగులలో చాలామందికి టెంపరేచర్ చెక్ చేయకుండానే మందులు రాసి పంపించడం పరిపాటిగా మారింది. ఇక పిల్లల ఓపీకి రోజూ 50 మందికి సేవలు అందిస్తున్నారు.



పోస్టులు భర్తీ చేస్తే మెరుగైన వైద్యం

వైద్యుల పోస్టులన్నింటినీ భర్తీ చేస్తేనే మెరుగైన వైద్యం అందుతుందని పలువురు ప్రజలు అభిప్రాయాలు వస్తున్నాయి. వైద్యుల కొరత కారణంతో తక్కువ సమయంలో ఎక్కువ మంది రోగులకు వైద్యసేవలు అందజేస్తున్నారు. దీంతో సరైన వైద్యం అందడం లేదని విమర్శలొస్తున్నాయి.

మెరుగైన వైద్యం అందజేస్తున్నాం



ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. రోగుల తాకిడి ఎక్కువగా ఉంది. అయినా రోగి పరిస్థితిని బట్టి అవసరమైతే ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుంటున్నాం. వైద్యుల ఖాళీల అంశం ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. రాష్ట్రంలో వైద్యుల భర్తీ కాగానే ఇక్కడికి కూడా వస్తారు.

– డాక్టర్ పావని, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్



ఓపీ విభాగంలో రోగుల క్యూ



సదాశివపల్లి.. వ్రతాలతో శోభిల్లి

కార్తీక మాసం సందర్భంగా మంగళవారం కౌడిపల్లి మండలం సదాశివపల్లి.. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. విశేష పూజల మధ్య భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని దంపతులు ఆచరించారు. ముందుగా గ్రామ అర్చకులు ఉమాశంకరశర్మ స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి చందన అలంకరణ గావించారు. అనంతరం భక్తులు మొక్కులను తీర్చుకున్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్):



రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రతీసంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకొంటామన్నారు. ఈ విషయమై ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి ఎస్పీ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, ఏఓ మణి, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, సందీప్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. మెదక్ మున్సిపాలిటీ:

క్లుప్తంగా

వైభవంగా మధనానంద స్వామి ఆరాధన ఉత్సవాలు


ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్‌): మండలంలోని రంగంపేటలోని ఆశ్రమంలో మధనానంద స్వామి సరస్వతీ ఆరాధనోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద స్వామి సరస్వతీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆశ్రమంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అంతకుముందు మాధవానంద స్వామి మాట్లాడుతూ.. డిసెంబర్‌ 1న గురు మధనానంద స్వామి జన్మస్థలి టేక్మాల్‌లో మహారుద్ర యాగం ఉంటుందని, ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌ రమేశ్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ యువజన అధ్యక్షుడు సంతోష్‌రావు, నాయకులు శ్రీనివాస్‌ రెడ్డి, భాను ప్రకాష్‌రెడ్డి, రవితేజరెడ్డి, ఆంజనేయులు, సురేశ్‌ తదితరులు ఉన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను అందజేశారు.

అంబేడ్కర్‌ ఆశయాలు కొనసాగించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌


అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

మెదక్‌జోన్‌ : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద గొప్ప రాజ్యాంగం భారత రాజ్యాంగమని నవంబర్‌ 26న రాజ్యాంగం అమలులోకి వచ్చినటువంటి విషయాలను గుర్తుకు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, సీనియర్‌ నాయకులు వరుగంటి రామ్మోహన్‌ గౌడ్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళితుల్ని విభజించి పాలించడం మానుకోండి

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌


పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న రవికుమార్‌, తదితరులు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): తమ స్వలాభాల కోసం దళితుల్ని విభజించడం బాధకరమని, అగ్రవర్ణ కులాల వాళ్ల మాయలో పడి దళితులం విడిపోవడం ఏంటని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌ అన్నారు. ఎస్టీ, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన పాదయాత్రలో భాగంగా మంగళవారం మనోహరాబాద్‌ మండలంలో యాత్ర నిర్వహించారు. లింగారెడ్డిపేట్‌ వద్ద భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్‌, మండల మాలమహానాడు ఆధ్వర్యంలో లింగారెడ్డిపేట్‌ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్‌ 1న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు తమ స్వార్థాల కోసం దళితులను విడదీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మరాటి రాజు, సామల అశోక్‌, అనిల్‌, ఓంకార్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ బడి.. స్ఫూర్తి ఒడి

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సర్వీస్‌ సిబ్బంది నియామకం
- విద్యార్థుల సంఖ్యను మేరకు నిధుల కేటాయింపు
- మూడు నెలలకు సంబంధించి రూ.1.59 కోట్లు విడుదల
- ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తప్పిన ఇబ్బందులు

విద్యార్థుల సంఖ్య	నిధులు	పాఠశాలలు
1-30	రూ.3వేలు	281
31-100	రూ.6వేలు	405
101-250	రూ.8వేలు	177
251-500	రూ.12వేలు	35
501-750	రూ.15వేలు	12
751 కంటే ఎక్కువ	రూ.20వేలు	02


మిరుదొడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతి గది

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య సమస్య తీరింది. ఏడాదిన్నర కిందట పాఠశాలల్లో పని చేసే స్కావెంజర్లను తొలగించారు. దీంతో పాఠశాలలో పారిశుద్ధ్య సమస్యతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. అమ్మ ఆదర్శ పాఠశాల నేతృత్వంలో పారిశుద్ధ్య సమస్యకు ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపింది. విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మూడు నెలలకు సంబంధించిన నిధులను సోమవారం రూ.1.59 కోట్లను కలెక్టర్‌ మనుచౌదరి విడుదల చేశారు.

నెలకు రూ.53 లక్షలు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో సర్వీస్‌ పర్సన్‌లను తాత్కాలికంగా నియమించి వారికి నెలసరి వేతనాలు ఇవ్వాలని విద్యాశాఖ ఆదేశించింది. ఇలా విద్యా సంవత్సరానికి 10 నెలలపాటు వేతనం చెల్లించనున్నారు. సర్వీస్‌ పర్సన్‌లతో మరుగుదొడ్లు, తరగతి గదులను శుభ్రంతో పాటు పాఠశాలల్లో పచ్చదనం కోసం మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా అప్పగించారు. జిల్లాలోని 912 ప్రభుత్వ పాఠశాలలకు నెలకు రూ 53,29,000 నిధులను విడుదల చేయనున్నారు. ఆగస్టు, సెప్టెంబర్‌, అక్టోబర్‌ నెలలకు సంబంధించి రూ.1,59,87,000 లు విడుదల చేశారు.

తప్పిన ఇబ్బందులు

పాఠశాలలను శుభ్రపరిచే బాధ్యతలను గతంలో పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించారు. దీంతో వారికి కాలనీలు, గ్రామాల్లో ఊడ్చే సరికే సమయం సరిపోవడంతో ఎప్పుడో ఒకసారి వెళ్లి శుభ్రం చేసేవారు. పాఠశాలలో మరుగుదొడ్లను, తరగతి గదులను శుభ్రం చేయకపోవడంతో పాఠశాలలకు ఆధునిక హంగులు కల్పించినా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమస్యలు తప్పలేదు. పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి ఉపాధ్యాయ సంఘాలు తీసుకెళ్లారు. దీంతో పారిశుద్ధ్య పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఇబ్బందులు తప్పాయి.

ఉచిత విద్యుత్‌ నిర్ణయం

పలు ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్‌ తరగతులు అమలవుతున్నాయి. అలాగే పలు పాఠశాలల్లో సాంకేతిక విద్య కోసం కంప్యూటర్లను అందించారు. సాంకేతిక బోధనతో విద్యుత్‌ బిల్లులు అధికంగా వస్తున్నాయి. పాఠశాల గ్రాంట్‌ సరిపోకపోవడంతో ప్రధానోపాధ్యాయులే సొంత డబ్బులను చెల్లించేవారు. ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ పాఠశాలకు ఉచితంగా విద్యుత్‌ అమలు చేయాలని నిర్ణయించారు.

పాఠశాల పరిశుభ్రంగా..



అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో సర్వీస్‌ పర్సన్‌లను తాత్కాలికంగా నియమించాం. వారి ద్వారా పాఠశాల తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయి. గతంలో స్కావెంజర్ల తొలగింపుతో కొంత ఇబ్బందులు ఎదురయ్యాయి. కలెక్టర్‌ ఆమోదంతో నిధులు విడుదల అయ్యాయి. రెండు మూడు రోజుల్లో ఆయా పాఠశాల కమిటీల అకౌంట్‌లలో జమ కానున్నాయి.

– శ్రీనివాస్‌ రెడ్డి, డీఈఓ


ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్‌ సత్యనారాయణరెడ్డి, తదితరులు

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

- రాజ్యాంగ దినోత్సవ వేడుకలో వక్తలు
- జూనియర్‌ కళాశాల విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ

సిద్దిపేటఎడ్యుకేషన్‌: దేశ ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను భారత రాజ్యాంగ ప్రవేశిక ప్రతిబింబిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో నెహ్రూయువక కేంద్రం, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ సత్యనారాయణరెడ్డి, పౌరశాస్త్ర అధ్యాపకుడు నంట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల ద్వారా ఎన్నికైన సభ్యులతో కూడిన రాజ్యాంగ పరిషత్‌ రాజ్యాంగాన్ని రూపొందించిందన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాజ్యాంగం ఆమోదించుకున్న రోజైన నవంబర్‌ 26న భారత ప్రభుత్వం 2015 నుంచి దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వివిధ అవగాహన కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రాజ్యాంగ ప్రవేశికను చదివించారు. అనంతరం అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీని ప్రిన్సిపాల్‌ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌వైకే కార్యక్రమ అధికారి కిరణ్‌, మానిటరింగ్‌ అధికారి బేతి భాస్కర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ అధికారి ధరిపల్లి నగేశ్‌, స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ శ్రీకాంత్‌, అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, కనకచంద్రం, అశోక్‌, వెంకటరమణ, రఘురాజ్‌, గంగాధర్‌, రాజ్యలక్ష్మి, రాజశేఖర్‌, కౌసర్‌, విజయభాస్కర్‌, ప్రసాద్‌, ఫాతిమ, చక్రవర్తి, భేతి శ్రీనివాస్‌, నవనీత, కొమురయ్య, దాసు, ఖుర్షిద, పాఠశాల హెచ్‌ఎంలు విజయ్‌కుమార్‌, కుమారస్వామి మల్టీపర్పస్‌, క్రాంతీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకొని రైతు బలవన్మరణం


బాలేశ్‌ (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): ఉరేసుకొని రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని ఝాన్సిలింగాపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు చాకలి బాలేశ్‌ (30) కొంత కాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతున్నాడు. దీనికి తోడు అప్పులు కూడా ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాంగ్‌రూట్‌లో ట్రాక్టర్‌.. ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- డ్రైవర్‌తోపాటు నలుగురికి గాయాలు
- కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఘటన


గాయాలతో డ్రైవర్‌ దాస్‌


ముందు భాగం దెబ్బతిన్న బస్సు

కొండపాక(గజ్వేల్‌): రాంగ్‌ రూట్‌లో వెళ్తూ యూటర్న్‌ అవుతున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కుకునూర్‌పల్లిలో వరి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో నింపుకున్న డ్రైవర్‌ పోలీస్‌స్టేషన్‌ సమీపంలోనే రాజీవ్‌ రహదారి పక్కన ఉన్న పెద్ద కాంటాలో తూకం వేయించారు. అనంతరం రాంగ్‌ రూట్‌లో ట్రాక్టర్‌ను తీసుకెళ్తూ రహదారి పై యూటర్న్‌ అవుతూ సడన్‌గా బ్రేక్‌ వేశాడు. ఇదే సమయంలో హైదరాబాద్‌ నుంచి సిద్దిపేట వైపునకు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇంజన్‌ నుంచి ట్రాలీ విడిపోయి ధాన్యం కుప్పలతో సహా రోడ్డుపై పడిపోయింది. ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతినగా క్యాబిన్‌లో ఇరుక్కొని డైవరు దాస్‌ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీసి 108 అంబులెన్స్‌ ద్వారా స్వల్ప గాయాలైన ప్రయాణికులు నీలిమ, అరుణ, విజయ, శిరీషలతో కలిపి అందరినీ గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు అంబులెన్సు సిబ్బంది పేర్కొన్నారు.

బెల్ట్‌ షాపులపై నిఘా పెట్టాలి

- సిద్దిపేట సీపీ అనురాధ
- పోలీసు అధికారులతో పెండింగ్‌ కేసులపై సమీక్ష


సమావేశంలో పోలీస్‌ అధికారులతో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: ప్రతీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఉన్న బెల్ట్‌ షాపులపై నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని, బెల్ట్‌ షాపులు నిర్వహించకుండా సంబంధిత వ్యక్తులకు కౌన్సిలింగ్‌ నిర్వహించాలని సీపీ అనురాధ సూచించారు. పోలీసు కమిషనర్‌ కార్యాలయంలో పోలీసు అధికారులతో పెండింగ్‌ కేసులపై సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళ, ఉమెన్స్‌ మిస్సింగ్‌ కేసుల్లో దరఖాస్తులు రాగానే వెంటనే కేసు నమోదు చేసి, పరిశోధన చేసి ట్రేసవుట్‌ చేయాలన్నారు. మిస్సింగ్‌ కేసుల్లో అలసత్వం వహించొద్దన్నారు. డిసెంబర్‌ 14న జరిగే జాతీయ మెగా లోక్‌ అదాలత్‌లో లిస్టవుట్‌ చేసిన కేసులను డిస్పోజల్‌ చేయాలని అధికారులకు సూచించారు. మీ సేవ నుంచి అప్లికేషన్‌లను డిస్పోజల్‌ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని, తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజబుల్‌ పోలీసింగ్‌ విధులు నిర్వహించాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామాలను సందర్శించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌, ఇతర మత్తు పదార్థాలపై నిఘా ఉంచాలని సూచించారు. సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, గజ్వేల్‌ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, హుస్నాబాద్‌ ఏసీపీ సతీష్‌, ట్రాఫిక్‌ ఏసీపీ సుమన్‌కుమార్‌, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్‌, విద్యాసాగర్‌, శ్రీను, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌ శ్రీధర్‌గౌడ్‌, ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరు మృతి

మరొకరి పరిస్థితి విషమం


కిషన్‌ (ఫైల్‌)

దుబ్బాక : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన దుబ్బాక పట్టణంలోని లచ్చపేట రోడ్డులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన నారం కిషన్‌ (42) పని నిమిత్తం బైక్‌పై లచ్చపేటకు వెళ్లాడు. సోమవారం రాత్రి దుబ్బాకకు వస్తుండగా గంగమ్మ గుడి సమీపంలో టీ పాయింట్‌ వద్ద బైక్‌ అదుపుతప్పి మరో బైక్‌కు ఢీ కొట్టింది. ఈ కిషన్‌తోపాటు మరో బైక్‌పై ఉన్న గన్నె శ్రీనివాస్‌ రెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను దుబ్బాక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించి కిషన్‌ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి పరిస్థితి కూడా విషమంగా ఉండగా ప్రస్తుతం సిద్దిపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు కిషన్‌ భార్య జయశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడాకారులు పట్టుదలతో పోరాడాలి

- డీఈఓ రాధాకిషన్‌


మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్‌

మెదక్‌ కలెక్టరేట్‌: క్రీడాకారులు ఓటమికి భయపడకుండా పట్టుదల పోరాడి విజయం సాధించాలని డీఈఓ రాధాకిషన్‌ సూచించారు. మంగళవారం స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ మెదక్‌ జిల్లా ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్‌ స్టేడియంలో అండర్‌ 14 రాష్ట్రస్థాయి షటిల్‌, బాడ్మింటన్‌ క్రీడలను ఆయన ప్రారంభించారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమన్నారు. ఓడిన క్రీడాకారులు నిరుత్సాహానికి గురి కాకుండా పట్టుదలతో విజయాలను సాధించడానికి కృషి చేయాలన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆర్గనైజింగ్‌ కార్యదర్శి రమేశ్‌ మాట్లాడుతూ ఉమ్మడి పది జిల్లాల నుంచి 50 మంది బాలురు, 50 మంది బాలికలు, 30 మంది కోచ్‌, మేనేజర్‌లు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, టోర్నమెంట్‌ ఆర్గనైజర్‌ వినోద్‌ కుమార్‌, పరిశీలకులు హమీద్‌ ఖాన్‌, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, మధుసూదన్‌, దేవేందర్‌ రెడ్డి, శ్యామ్‌, సుజాత కుమారి, శ్వేతాకుమారి, శిల్ప, రూపేందర్‌, దేవేందర్‌, సత్యారావు, కిష్టయ్య, హరీశ్‌, ప్రభాకర్‌, మనోహర్‌, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మల్లకంబ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సిద్దిపేటరూరల్‌: ఉమ్మడి మెదక్‌ జిల్లా ఎస్‌జీఎఫ్‌ మల్లకంబ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాఘవాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మంజుభార్గవి మంగళవారం తెలిపారు. నారాయణరావుపేట పాఠశాల వేదికగా 25వ తేదీన ఉమ్మడి మెదక్‌ జిల్లా మల్లకంబ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సత్తాచాటి అండర్‌ 14 విభాగంలో పీ.అవినాష్‌, పీ.కుమార్‌, అండర్‌ 17 విభాగంలో బీ.అజయ్‌, పీ.శివకుమార్‌, ఎన్‌.గోవర్ధన్‌ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎంపికయ్యారు. విద్యార్థులను తీర్చిదిద్దిన పీడీ ఏర్వ అశోక్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అథ్లెటిక్స్‌ పోటీలకు ఇద్దరు విద్యార్థులు

సిద్దిపేట పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో ఆర్‌డీఎఫ్‌ మాటిండ్ల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్‌ నర్సింగోజు విష్ణుమూర్తి తెలిపారు. సబ్‌ జూనియర్‌ అథ్లెట్స్‌ చాంపియన్‌షిప్‌లో అండర్‌ 12 లాంగ్‌జంప్‌ విభాగంలో 7 వ తరగతి చదువుతున్న నీలం ఆశ్వద్‌, అండర్‌10 300 మీటర్ల విభాగంలో 4వ తరగతికి చెందిన చుక్క శ్రీహన్విలు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్‌, అసిస్టెంట్‌ హెడ్‌మాస్టర్‌ మల్లయ్య, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

కుటుంబ కలహాలతో కెనాల్‌లో దూకిన మహిళ

- పైపు సాయంతో కాపాడిన స్థానిక యువకులు
- సిద్దిపేట పట్టణ శివారులో ఘటన


కెనాల్‌ గట్టుపై బాధితురాలు

సిద్దిపేటకమాన్‌: కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను ఇద్దరు యువకులు కాపాడారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సిద్దిపేట డబుల్‌ బెడ్రూం కాలనీలో నివాసం ఉంటున్న చాంద్‌ బీ(46) అనే మహిళ హైదరాబాద్‌లో ఉండే తన కుమారుడితో డబ్బుల విషయంలో గొడవ పడింది. సోమవారం రాత్రి ఇదే విషయంపై గొడవ జరుగగా తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం రంగనాయక్‌ సాగర్‌ కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించింది. నీటిలో మునుగుతున్న మహిళను గుర్తించిన స్థానిక ఇద్దరు యువకులు వ్యవసాయ బావికి వినియోగించే ప్లాస్టిక్‌ పైపు సాయంతో కాపాడారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు ఆమెను అప్పగించారు.

పాప కిడ్నాప్‌ కథ సుఖాంతం


పాప (ధరణి)

సంగారెడ్డి క్రైమ్‌: అపహరణకు గురైన పాపను పోలీసులు క్షేమంగా తల్లి చెంతకు చేర్చారు. ఈ ఘటన సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్‌ కథనం ప్రకారం.. బస్వాపూర్‌ గ్రామం పుల్‌కల్‌ మండలానికి చెందిన ఆకుల ప్రియ తన కుమార్తె ధరణి (2)తో కలిసి మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. ప్రియకు కళ్లు సరిగ్గా కనపడకపోవడంతో తన బిడ్డను చీర కొంగుతో కట్టేసుకుంది. మధ్యాహ్నం పాప ఆడుకుటుందని వదిలేయడంతో అదునుగా భావించిన దుండగలు పాపను అపహరించారు. వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీసీటీవీ ఫుటేజ్‌ చెక్‌ చేస్తుండగా సంగారెడ్డిలోని నూతన బస్టాండ్‌ వద్ద రాత్రి 9 గంటలకు పాప ఆచూకీ లభించిందని పోలీసులు వెల్లడించారు. ప్రియకు పాపను అప్పగించారు. నిందితుడు కోసం గాలిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

చలి.. గజగజ

జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ చల్లి తీవ్రత పెరుగుతోంది. ఉదయం 8 గంటల వరకు కురుస్తోంది. రోజలంతా చలి గాలు వీస్తున్నాయి.. పట్టణంలో మహారాష్ట్ర, రాజస్థాన్‌ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఉన్ని దుస్తులు, చలికోట్లు, స్వెట్టర్లు, మాస్కులు అమ్ముతున్నారు.

-సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్‌, సిద్దిపేట






రహదారిలో మంచు


ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్న పట్టణవాసులు


వేడి.. వేడిగా..

వృద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ పల్వాన్‌కుమార్‌



సిద్దిపేటకమాన్‌: చలి తీవ్రతతో వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్‌ పల్వాన్‌కుమార్‌ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. చలి తీవ్రత పెరుగుతుండడం, ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధ సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. స్వెటర్లు, ఉన్ని దుస్తులు ధరించాలన్నారు. దూర ప్రయాణాలు చేయకూడదని తెలిపారు. వేడి వేడి ఆహారం తీసుకోవాలని, బయట ఆహారం తీసుకోకపోవడం మంచిదన్నారు. ప్రజలకు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగహన కల్పించాలని సూచించారు.